ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
ఆదివారం | 23 | జూన్ | 2024
పేజీలు 4

## జిల్లాపరిషత్ స్కూల్ నుంచి జాతీయ స్థాయికి



వార్త 4 లో

# ఆరోగ్యమే గొప్ప సంపద

## హైకోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నంద



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందని హైకోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నంద తెలిపారు. శనివారం రోజున పెద్దపల్లి జిల్లా న్యాయాధికారుల సమీక్షా సమావేశానికి విచ్చేసిన హైకోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నందకు పెద్దపల్లి ప్రిన్సిపల్ జిల్లా అండ్ సెషన్స్ జడ్జి డాక్టర్ డి.హేమంత్ కుమార్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లకిడి భాస్కర్, జనరల్ సెక్రటరీ కోటగిరి శ్రీనివాస్, ఇతర న్యాయవాదులు, సుల్తానాబాద్, గోదావరిఖని బార్ అసోసియేషన్ కు చెందిన న్యాయవాదులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన హై కోర్ట్ జడ్జ్ తరువాత కోర్టు ప్రాంగణంలో మొక్కను నాటారు. కోర్టు ప్రాంగణంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, జిల్లా వైద్యారోగ్య శాఖ సహకారంతో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపును హైకోర్టు జడ్జి ప్రారంభించారు. ఈ సందర్భంగా హైకోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నంద మాట్లాడుతూ, దేవుని ఆశీర్వాదంతో పెద్దపల్లిలో హెల్త్ క్యాంప్ ప్రారంభించే అవకాశం కలగడం తనకు సంతోషంగా ఉందని, మంచి ఆరోగ్యం ప్రతి మనిషికి అవసరమైన ప్రాథమిక అంశమని, మహాత్మా గాంధీ చెప్పినట్లు మనిషికి అసలైన సంపద మంచి ఆరోగ్యంగా ఉండటమేనని, బంగారం వెండి ఆభరణాలు కాదని,వైద్యులు తమ విధులు నిర్వహించే సమయంలో ఎల్లప్పుడూ సేవా దృక్పథంతో ఉండాలని, మహాత్మా గాంధీ సూచించిన విధంగా ఇతరులకు మనం ఏం ఇస్తున్నామనే విషయాలలో ఆనందం ఉంటుందని, మనకు ఏం వస్తుంది అనే విషయంలో ఆనందం ఉండదని గమనించాలని హైకోర్టు జడ్జి తెలిపారు. మానవ సేవే మాధవ సేవ అనే అంశాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటూ విధులు నిర్వహించాలని హైకోర్టు జడ్జి సూచించారు. ఏసీపీ జి. క్రిష్ణ, సి.ఐ. క్రిష్ణ తదితరులు ఉన్నారు.

## నత్తనడకన పైవంతెన పనులు

### రైతులకు ఓ న్యాయం.. పెట్రోల్ బంక్ యజమానికి ఓ న్యాయమా?

**ప్రజాపక్షం/శంకరపట్నం:** జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా శంకరపట్నం మండల పరిధిలోని కొత్తగట్టు గ్రామంలో జరుగుతున్న ప్లైఓవర్ నిర్మాణం నత్తనడకన సాగుతోంది. జాతీయ రహదారి విస్తరణ కోసం రైతుల నుంచి భూములు సేకరించి ప్రభుత్వం పరిహారం కొంతమందికి అందజేయకున్నప్పటికీ జబర్దస్తీగా పనులు చేపడుతున్నారు. ఇటీవల మొలంగూరు క్రాస్, కొత్తగట్టు గ్రామంలో పరిహారం రాలేదని గృహ యజమానులు ఆందోళన చేసిన విషయం విధితమే. ప్లై ఓవర్ నిర్మాణంలో కొత్తగట్టు గ్రామ శివారులో ఉన్న పెట్రోల్ బంకు పోతుండగా భూ సేకరణలో భాగంగా పరిహారం పొందారు. అయినప్పటికీ కాంట్రాక్టర్ అధికారుల నిర్లక్ష్యంతో పెట్రోల్ పంపు వరకు ప్లై ఓవర్ నిర్మాణం చేపట్టి అక్కడికే ఆపివేశారు. పెట్రోల్ బంక్ యజమాని ఇచ్చే మామూళ్లకు లొంగి అధికారులు పనులు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. వ్యవసాయ బావులు కోల్పోయిన రైతుల నుంచి అధికారులు భూ సేకరణలో భాగంగా జబర్దస్తీగా వ్యవసాయ బావిని పూడ్చివేసి పనులు చేశారు. కొత్తగట్టు గ్రామ శివారులోని పరిహారం పొందిన బంకు యజమాని మాత్రం పెట్రోల్ బంకు ముందు ప్లై ఓవర్ నిర్మాణం చేపట్టి పనులు చేపట్టాలని కొత్తగట్టు గ్రామ రైతులు డిమాండ్ చేశారు.



## మాట నిలబెట్టుకున్న కర్ణుడు జీవన్‌రెడ్డి

**ప్రజాపక్షం / జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలం తుర్కాశి నగర్ గ్రామ పిల్లలు గురువారం రోజున నిజామాబాద్ ప్రధాన రహదారిపై రెండు కిలోమీటర్లు నడుస్తూ తాటిపల్లి పాఠశాలకు వెళ్తున్న పిల్లలను చూసి వారితో మాట్లాడి తుర్కాశి నగర్‌లో స్కూల లేదని అనడంతో పిల్లలు ప్రతి రోజు వాళ్ల ఊరిలో స్కూల్‌లేకపోవడంతో రోడ్డుపైన రెండు కిలోమీటర్లు నడుస్తూ వెళ్లడం ప్రమాదకరంగా ఉంది. భయం అవుతుందని తెలపడంతో త్వరలోనే మీ ఊరుకు వచ్చి స్కూల్ అక్కడే పెట్టిస్తానని గురువారం రోజున మాట ఇచ్చిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి రెండు రోజుల వ్యవధిలో శనివారం రోజున ఉదయం తుర్కాశినగర్‌ను అధికారులతో సందర్శించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆ ప్రాంత పెద్దలతో పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రస్తుతం స్కూల్ నడపడానికి గదులు ఏర్పాటు చేసి మూడు నెలల్లో పాఠశాల భవనం నిర్మాణం పూర్తి చేపిస్తామని హామీ ఇచ్చారు. ఐదవ తరగతి వరకు పాఠశాలను, అంగన్వాడీ కేంద్రం తుర్కాశి నగర్‌లో ఏర్పాటు చేపిస్తామని ఉదయం టిఫిన్, మద్యాహ్నం బోజనం ఏర్పాటు చేపిస్తామని తెలిపారు. ఆరవ తరగతి పిల్లలకు తాటిపల్లి హైస్కూల్ వెళ్లడానికి ఉచిత రవాణా సదుపాయం కల్పిస్తామని తెలిపారు. తుర్కాశినగర్‌లోనే పాఠశాల అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేపియడంపై సంతోషం అని తుర్కాశి నగర్ ప్రజలు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కర్ణుడు అని కొనియాడారు.

## విద్యార్థుల నమోదు పెంచండి

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శనివారం కలెక్టర్ పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత (బాలికలు) పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత (బాలురు) పాఠశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ తో కలిసి తనిఖీ చేసిన అనంతరం జిల్లా కలెక్టర్ పెద్దపల్లి తహసిల్దార్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత (బాలికల)పాఠశాలను సందర్శించిన కలెక్టర్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న ప్లే గ్రౌండ్, భోజన శాల, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో స్టాఫ్ వివరాలు, విద్యార్థుల సంఖ్య తెలుసుకున్న కలెక్టర్, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పాఠశాల మైదానంలో స్టేజి డయాస్ కావాలని హెడ్మాస్టర్ కోరగా దానికి సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత (బాలుర) పాఠశాలను సందర్శించిన కలెక్టర్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన టాయిలెట్స్ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. పెద్దపల్లి తహసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ పెండింగ్ ధరణి దరఖాస్తుల వివరాలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## ఫైనాన్స్ కమీషన్ చైర్మన్ ను కలిసిన నాయకులు



ప్రజాపక్షం/బోథ్ : తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమీషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య ను బోథ్ మండల కాంగ్రెస్ నాయకులు కలిసి నియోజక వర్గానికి ప్రత్యేక నిధులు మంజూరు అయ్యే విధంగా చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పసుపుల చంటి, వైస్ చైర్మన్ కొమురం కోటేశ్వర్, పిఏసిఎస్ డైరెక్టర్ గొర్ల రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## తొలకరి చినుకులతో రైతన్నల పనులు ప్రారంభం



ప్రజాపక్షం / గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలో గల గ్రామాల్లో శుక్రవారం రాత్రి తొలకరి వర్షం కురియడంతో రైతులు వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే రైతులు దుక్కులు దున్నుకుని సిద్ధం చేసుకోగా రాత్రి కురిసిన వర్షానికి మండలంలో రైతులు పత్తి విత్తనాలు విత్తుతున్నారు. ఇక వర్షాలు కురిస్తే విత్తనాలు మొలకెత్తేందుకు వీలు ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ బిజీగా గడుపుతున్నారు. కాగా వ్యవసాయ అధికారులు మాత్రం విత్తనాలు విత్తడంలో తొందరపాటు వద్దని భూముల్లో ఇంకా వేడి తగ్గలేదని సూచిస్తున్నారు.

## పలు హోటల్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల పై మున్సిపల్ అధికారులు తనిఖీలు



ప్రజాపక్షం / మెట్ పల్లి : పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ టి మోహన్, ఆదేశాల మేరకు శనివారం ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ గుర్రం రత్నాకర్, పలు ఫాస్ట్ ఫుడ్, హోటల్ లపై పరిశుభ్రత గురించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు వాడవద్దని జ్యూట్ బ్యాగులు వాడాని. ప్లాస్టిక్ కవర్లు వాడితే 5000 జరిమానా విధిస్తామని అన్నారు. హోటల్స్ మెస్,లలో కిచెన్ సెక్షన్ లోపల పరిశుభ్రత పాటించాలని హోటల్ లకు లైసెన్స్ తీసుకోవాలని హోటల్స్ నుండి వెలువడే చెత్తను మున్సిపల్ వాహనాలకు అందించి యూజర్ చార్జీలు చెల్లించాలని ప్లాస్టిక్ కవర్లు వాడిన వారిపై జరిమానా విధించామని తెలిపారు. ఈ తనిఖీల్లో వారి వెంట ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, జూనియర్ అసిస్టెంట్ రవీందర్, సానిటరీ సిబ్బంది ముజీబ్, నాయక్, నిజాం, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాలల్లో వసతుల కల్పనను కృషిచేస్తా



ప్రజాపక్షం / మెట్ పల్లి : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలను, కోరుట్ల నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు శనివారం పరిశీలించారు. నిర్మాణం పూర్తికాక అసంపూర్తిగా ఉన్న భవనాలను పరిశీలించి 5 సంవత్సరాలు గడుస్తున్నా భవనాలు పూర్తికాకపోవడం ఏంటని అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలలో 8 మంది ఉపాధ్యాయులకు గాను నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారని ఇలా అయితే విద్యార్థులకు పాఠాలు ఎలా పూర్తవుతాయని అధికారులతో మాట్లాడి పాఠశాల సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు, అలాగే కోరుట్ల నియోజకవర్గంలో పలు ప్రభుత్వ పాఠశాలలో వసతులు, ఎస్సీ బాలికల హస్టల్ లో బీసీలకు సీట్లు పెంచాలని కళాశాలలో చదువుతున్నారని వారికి హస్టర్ సదుపాయం కల్పించాలని, పాఠశాల పాత భవనం మరమ్మత్తుల కోసం నిధులు మంజూరు చేయించి ప్రభుత్వ బడుల్లో సమస్యలు పరిష్కరణ కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, ఆకుల లింగ రెడ్డి, పట్టణ యూత్ అధ్యక్షులు జెట్టి లక్ష్మణ్, భరత్,రాజగోపాల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, కాలేజీ అధ్యాపకులు పాల్గొన్నారు.

## జగిత్యాల డిపిఆర్‌వోగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మణ్ కుమార్



ప్రజాపక్షం / జగిత్యాల ప్రతినిధి : జగిత్యాల జిల్లా డిపిఆర్‌వోగా విధులు నిర్వహించిన భీమ్ కుమార్ ఇటీవల బదిలీ కావడంతో ఆయన స్థానంలో కరీంనగర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న జి. లక్ష్మణ్ కుమార్‌కు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. అనంతరం ఇంచార్జీ డిపిఆర్‌వో లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో అధికారిక సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా మిత్రులకు అందించేదుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, అధికారిక సమాచారాన్ని పాత్రికేయులకు చేరవేయడంలో ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. సమాచార పౌర సంబంధాల శాఖ పనితీరును మరింత మెరుగు పరిచేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇవ్వాల్సిన నాలుగు డీఏలను వెంటనే ప్రకటించండి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు , పెన్షనర్లకు పెరిగిన ధరల సూచిక ఆధారంగా నాలుగు డీఏలను వెంటనే ప్రకటించాలని రిటైర్ట్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు జాలి మహేందర్ రెడ్డి కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం సరిపడా కరువు భత్యం (డిఏ) పెంచకుండా ఉద్యోగులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. జులై 2022, జనవరి 2023, జులై 2023, జనవరి 2024 ఇవ్వాల్సిన డీఏలను ఇవ్వకుండా దాటవేస్తుందన్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఒక డీఏ ప్రకటించడానికి ప్రయత్నిస్తే ఎన్నికల కమిషన్ అడ్డు చెప్పగా ఎన్నికలైన తర్వాత ఇవ్వమంటే డిఏ ఇవ్వకుండానే ఆ ప్రభుత్వం మారిపోయిందన్నారు. నేడు అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఎన్నికలకు ముందు మేము అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్ డిఏలు అనేవే ఉండవన్నారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఉద్యోగులకు డిఏలు ప్రకటిస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత రెండు, మూడు క్యాబినెట్ మీటింగ్‌లైనప్పటికీ ఒక్కసారి కూడా డీఏలకు సంబంధించిన అంశం చర్చించకుండా దాటవేయడం జరిగిందన్నారు. పార్లమెంటు ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత డీఏల గురించి ఎలాంటి ప్రకటన చేయకపోవడం పట్ల ఉద్యోగులంతరూ నిరాశ నిస్పృహలతో ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం డీఏలను ప్రకటించాలని జాలి మహేందర్ రెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

## ఎమ్మెల్యే సత్యంను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



ప్రజాపక్షం/గంగాధర: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి హైదరబాద్ అల్వాల్‌లోని పంచశీల కాలనీలో ఉన్న తమ నివాసంలో తీవ్రమైన కడుపు నొప్పితో గురువారం రాత్రి చున్నీతో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ సంధర్భంగా శనివారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హైదరాబాద్‌లోని వారి ఇంటికి వెళ్లి నివాళులర్పించి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను వారి పిల్లలను పరామర్శించారు. చిన్న వయస్సులోనే అర్ధాంతరంగా తనువు చాలించడం చాలా బాధాకరమని, ఈ సమయంలో వారి కుటుంబ సభ్యులకు ఆ దేవుడు కొండంత ధైర్యాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఆయన వెంట గంగాధర మండల తాజా మాజీ సర్పంచులు శ్రీమల్ల మేఘరాజు, నజీర్ హుస్సేన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్ రావు, బిఆర్ఎస్ నాయకులు దూలం శంకర్ గౌడ్, వేముల అంజి, వంజాల ఆంజనేయులు గౌడ్, వడ్లూరి ఆదిమల్లు, గడ్డం స్వామి, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## మరణించిన జర్నలిస్టుల పిల్లలకు మీడియా అకాడమీ చేయూత

ప్రజాపక్షం / జగిత్యాల ప్రతినిధి : మరణించిన జర్నలిస్టుల కుటుంబాల పిల్లలకు చేయూతను అందించేందుకు తెలంగాణ మీడియా అకాడెమి ముందుకొచ్చిందని మీడియా అకాడెమి కార్యదర్శి ఎన్. వెంకటేశ్వర్ రావు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాల పిల్లలకు ప్రతి నెల రూ.లు వెయ్యి చొప్పున ట్యూషన్ ఫీజు చెల్లించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరానికి (2024 25) సంబంధించిన బోనఫైడ్ సర్టిఫికెట్ల వివరాలతో ఈ నెల 28వ తేది లోపు సెక్రటరి తెలంగాణ మీడియా అకాడెమి ఇంటి నెంబర్ 59166 చాపల్ రోడ్డు, నాంపల్లి, హైదరాబాద్ 500001 చిరునామాకు రిజిస్టర్ పోస్టు ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కావున మరణించిన కుటుంబాల జర్నలిస్టుల పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ

ప్రజాపక్షం / ఆసిఫాబాద్ : బడి బాట కార్యక్రమంలో భాగంగా ఆసిఫాబాద్ మండలం లోని బాబాపూర్, రౌట సంకెపల్లి ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఎంపిపి అరిగెల మల్లికార్జున్ యాదవ్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య తో పాటు, మధ్యాహ్నం భోజనం, ఉచితంగా పుస్తకాలు, దుస్తులను అందించడం జరుగుతుందని అన్నారు. బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సత్రవేణి మల్లేష్ సావిత్రి, ఎంఇఒ మానుకు మార్, సత్రవేణి రాజన్న, పటేల్ కిషన్, పొల్కర్ బీజ్జు, కిరణ్, మల్లి కార్జున్, సురేందర్, మాజీ ఉప సర్పంచ్ ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## షెడ్యూల్ కులాల స్టడీ సర్కిల్లో సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ ఉచిత కోచింగ్

ప్రజాపక్షం / ఆసిఫాబాద్ : షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖకు చెందిన రాష్ట్ర స్టడీ సర్కిల్ హైదరాబాద్ నందు సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ ఉచిత కోచింగ్ కోసం అర్హులైన అభ్యర్థులనుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అర్హులైన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, (బిసి ఇ) తో పాటు దివ్యాంగులైన అభ్యర్థులు ఈ నెల 17 నుండి జూలై 10 వరకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. వంద మంది అభ్యర్థుల ఎంపిక కొరకు జూలై 21న ప్రవేశ పరీక్ష ఉంటుందని అన్నారు. ఎంపికైన అభ్యర్థులకు పదినెలల రెసిడెన్షియల్ ఉచిత కోచింగ్ ఉంటుందని, ఇతర వివరాలకు http://tsstudycircle.co.in వెబ్ సైట్‌ను సందర్శించవచ్చని సూచించారు

## వర్షానికి ప్రభుత్వ పాఠశాల పరారీ గోడ కూలింది



ప్రజాపక్షం/మెట్ పల్లి : పట్టణంలోని 1 వార్డులలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పరారీ గోడ శక్రవారం రాత్రి కరిసిన అకాల వర్షంతో రోడ్డుపై కూలిపోయింది. శనివారం మున్సిపల్ కమిషనర్ టి మోహన్ ఆదేశాల మేరకు మున్సిపల్ జెసిబి సహయంతో పక్కనే ఉన్న మురికి కాలువలో రోడ్డుపై కూలిన పరారీ గోడ ఇటుకలను తొలిగించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ గుర్రం రత్నాకర్, స్కూల్ హెడ్మాస్టర్ నారాయణ, సిబ్బంది ముజీబ్, పరిశుద్ధ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## బండిని కలిసిన చొప్పదండి బిజెపి నాయకులు



ప్రజాపక్షం/చొప్పదండి: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను శనివారం కరీంనగర్ ఎంపి కార్యాలయంలో చొప్పదండి బిజెపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంధర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ తన గెలుపు కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు ఓటు వేసిన చొప్పదండి పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, బిజెపి పట్టణ అధ్యక్షుడు బత్తిని ప్రశాంత్, నాయకులు రాజన్నల రాజు, చిల్ల శ్రావణ్, మంచికట్ల మల్లేష్, మంద శ్రీరామ్, తాడూరి రామకృష్ణ, గుండేటి శివ, తాడూరి శివకృష్ణ, అనుమాండ్ల రాజశేఖర్, జిట్టా కుమార్, బొడిగె సురేష్, మేడిచెలిమి చంద్రయ్య, ఎలిగేటి వికాస్, సుధాకర్, చల్ల అనూష్, అనుమాండ్ల కోటేష్, సతీష్ తదితరులున్నారు.

## తప్పిన రోడ్డు ప్రమాదం

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ ఏరియాలో మితిమీరిన వేగంతో నిర్లక్ష్యంగా లారీని నడపడంతో అదుపుతప్పి జాతీయ రహదారి ఝూన్సీ నగర్ వద్ద డివైడర్ మధ్యలోకి దూసుకెళ్లింది. శనివారం మంచిర్యాల్ నుండి చెన్నూరు వైపు వెళుతున్న లారీని డ్రైవర్ నిర్లక్ష్యంతో నడపడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. మితిమీరిన వేగాలతో ప్రమాదాలకు కారణమవుతూ అమాయకుల ప్రాణాలను బలిగొంటున్న నిర్లక్ష్యపు డ్రైవర్ల పై కఠినంగా వ్యవహరించాలని స్థానికులు అన్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

## ఆమరణ నిరాహార దీక్షకైనా సిద్ధమే..



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలోని హరిహర క్షేత్రం దివ్యనగర్ లో గల 534 సర్వే నంబర్ లోని ప్రభుత్వ భూమిలో అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని గత రెండు నెలలుగా జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క,జిల్లా కలెక్టర్,రెవెన్యూ అదనపు కలెక్టర్,రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి కూడా తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేయడం జరిగింది.కానీ ఇప్పటివరకు ఎటువంటి స్పందన లేదు ఇదే విషయమై నిర్మల్ జిల్లాలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను పరిరక్షించాలని లేనియెడల ఆమరణ నిరాహార దీక్ష కైనా సిద్ధమని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.వెంకట స్వామి,నిర్మల్ జిల్లా అధ్యక్షుడు బత్తుల రంజిత్ ప్రభుత్వాన్ని డిమాండ్చేశారు.ఈ కర్యాక్రమంలో ఉపాధ్యక్షులు పురుషోత్తం,దామ భూమేష్,పట్టణ అధ్యక్షులు కత్తి నవీన్,జైల లింగయ్య,కత్తి సుదర్శన్,భూమన్న తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షానికి కూలిన ట్రాన్స్ ఫార్మర్ గద్దె

**ప్రజాపక్షం/ముధోల్ :** మండల కేంద్రంలోని నయాబాది కాలనీలో రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్ ఫార్మర్ ప్రమాదకరంగా ఉండడంతో విద్యుత్ శాఖ అధికారులు ఇటీవలే గద్దెను నిర్మించారు.శనివారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షానికి నూతనంగా నిర్మించిన గద్దె కూలి ప్రమాదకరంగా మారింది.గద్దె కూలిన ట్రాన్స్ ఫార్మర్ ను విద్యుత్ శాఖ సిబ్బంది పరిశీలించారు.అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోని విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## విద్యుత్ షాక్తో ఎద్దు మృతి..



**ప్రజాపక్షం/కుంటాల :** మండలంలోని ఓలా గ్రామానికి చెందిన కూస రాజేశ్వర్ అనే వ్యక్తి తన వ్యవసాయ క్షేత్రంలో పోలల గట్టున మేస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్ పార్మర్ దగ్గర కరెంట్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది.సుమారు ఎద్దు విలువ రూ.90 వేల వరకు ఉంటుందని ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

# రుణమాఫీ పట్ల కాంగ్రెస్ నాయకుల సంబరాలు

**ప్రజాపక్షం/ముత్తారం :** కాంగ్రెస్ పార్టీ ఏకకాలంలో రైతు రుణమాఫీ చేసినందుకు ముత్తారం మండల కేంద్రంలోని కాసర్ల గడ్డ బస్టాండ్ ఆవరణంలో బాణాసంచి పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజానీకానికి తెలంగాణ రాష్ట్ర మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్ బాబు పిసిసి అధ్యక్షులుగా రేవంత్ రెడ్డి వరంగల్ డిక్లరేషన్ సభలో రాహుల్ గాంధీ సమక్షంలో తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని మాట ఇవ్వడం జరిగిందని ఇచ్చిన మాటకు కట్టుబడి మంత్రి శ్రీధర్ బాబు, సియం రేవంత్ రెడ్డి,తుమ్మల నాగేశ్వరరావు నిన్న జరిగిన క్యాబినెట్ లో చర్చించి 31 వేల కోట్ల రూపాయలను తెలంగాణ రైతాంగానికి ఏకకాలంలో 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేయడానికి క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసి విధివిధానాలతోటి ఆగస్టు 15వ తారీకు లోపల పూర్తి చేయనున్నారు. తెలంగాణ రైతాంగం కళ్ళల్లో ఆనందం చూడడమే తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలన విధానమని మరోసారి నిరూపణ చేసినందుకుగాను ముత్తారం మండల అధ్యక్షులు దొడ్డ బాలాజీ కృతజ్ఞతలు తెలపడం జరిగింది.అదేవిధంగా మంత్రి శ్రీధర్ బాబుకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికారిక సమాచార హోదాను కల్పించడంతో మంథని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీకి అరుదైన గౌరవం లభించిందని మరొక మారు మంథని నియోజకవర్గ ప్రజల పక్షాన తెలంగాణ రాష్ట్రానికి దశా దిశా దిక్సూచిగా



ఉన్నటువంటి శ్రీధర్ బాబుకి ప్రత్యేక అభినందనలు ముత్తారం మండల అధ్యక్షులు దొడ్డ బాలాజీ తెలిపారు.ఈ కార్యక్రమంలో ముత్తారంరం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థి నాయకులను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం

### నాయకులను వెంటనే విడుదల చేయాలి...

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నీట్ పరీక్షల్లో అన్యాయానికి గురైన విద్యార్థులకు న్యాయం చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలిపిన వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్ జిల్లా కేంద్రంలో గల భగత్ సింగ్ భవన్ లో శనివారం రోజున జరిగిన పి.డి.ఎస్.యు జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ నీట్ పరీక్షలను మళ్లీ నిర్వహించాలని,దేశవ్యాప్తంగా నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలతో విద్యార్థులంతా రోడ్డెక్కితే ప్రధానమంత్రి,కేంద్ర విద్యా శాఖ మంత్రులు స్పందిచకపోగా కనీసం బీజేపీ ఎంపీలు కూడా మౌనంగా



ఉండడం విడూరంగా ఉందని అన్నారు.ప్రధాని మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రాగానే వైద్య వృత్తి విద్యార్థులు ఇంతటి అన్నాయానికి గురవుతే ఇక ముమ్ముందు దేశంలోని విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్ధకమే అని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ తరుణంలో రాష్ట్ర వ్యాప్తంగా నీట్ పరీక్షలో అన్యాయానికి గురైన విద్యార్థుల పక్షాన పోరాడుతున్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులను బేషరతుగా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో పి.డి.ఎస్.యు నాయకులు వినోద్,పవన్,ధ్రువ, అరుణ్ పాల్గొన్నారు.

## స్కూల్ బస్లను తప్పనిసరిగా కండిషన్లో ఉంచాలి



ట్రాఫిక్ సిఐ నరేష్ కుమార్

**ప్రజాపక్షం/మంచిర్యాల క్రైం :** స్కూల్ బస్సులను తప్పని సరిగా కండిషన్లో ఉంచుకోవాలని, డైవర్లు యూనిఫాం ధరించి పాఠశాల బస్సులు నడపాలని మంచిర్యాల ట్రాఫిక్ సిఐ నరేష్ కుమార్ అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల్లోని బస్సులను పరిశీలించి డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘించిన, నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంస్థల బస్సులు నడిపితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పాఠశాల యాజమాన్యాలకు హెచ్చరికలు జారీ చేశారు. పిల్లలను రవాణా చేసే వాహనాలను తప్పనిసరిగా కండిషన్లో ఉంచుకోవాలని, వాహనాల్లో తప్పనిసరిగా ఫిట్నెస్, ఇన్సూరెన్స్, పర్మిట్, డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్, ఫైర్ సేఫ్టి కిట్, ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉంచుకోవాలని తెలిపారు. అటెండర్ లేని బస్సులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని, పాఠశాలలకు విద్యార్థులను తరలించే వాహనాల్లో పరిమితికి మించి విద్యార్థులను తరలించకూడదని అటువంటి వాహనాలపై కఠినంగా వ్యవహరిస్తామని సూచించారు.

## ప్రిన్స్ హై స్కూల్ సీజ్ చేసిన యంఇఒ శంకర్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, డ్రెస్సులు, బ్యాగులు అమ్ముతున్నట్లు ఎబివిపి ద్వారా సమాచారం తెలుసుకున్న ఎంఇఒ ప్రిన్స్ హై స్కూల్లో బుక్స్ డ్రెస్ లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ శంకర్ మాట్లాడుతూ నిర్మల్ లోని ప్రిన్స్ హై స్కూల్ పుస్తకాలను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతున్న ప్రైవేట్ స్కూల్స్ కార్పొరేట్ స్కూల్పై చర్యలు తీసుకుంటామన్నారు. విచ్చలవిడిగా పుస్తకాలను అమ్ముతున్నారని తెలిస్తే స్కూల్స్ అనుమతులను రద్దు చేస్తామన్నారు. అనంతరం ఎబివిపి నాయకులు మాట్లాడుతూ మధ్యతరగతి విద్యార్థులు పుస్తకాలు కోనలేకా ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు అదే విధంగా ప్రభుత్వ నిబంధనలకు విరుదంగా పుస్తకాలు అధిక ధరలకు అమ్మతున్న ప్రైవేట్ పాఠశాలాలు, అంతే కాకుండా ఫీస లు అధికంగా వసూలు చేయడం జరుగు



తుంది. అలాగే అక్రమంగా పాఠశాలలోనే ఒక గదిలో పెట్టి పుస్తకాలను అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అధిక ధరలకు అమ్ముతున్న యాజమాన్యం అదే విధంగా ఈ ఒక్క ప్రైవేటు దందా పై కచ్చితంగా చర్యలు తీసుకోవాలని తెలియజేయ్యడం జరుగుతుంది. ప్రైవేట్ పాఠశాల పై చర్యలు తీసుకోవాలని ఎబివిపి డిమాండ్ చేస్తుంది లేని యడల పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హేచ్చరిస్తునాం. ఈ కార్యక్రమంలో ఇందూర్ విభాగ్ ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ చంద్రగిరి శివ కుమార్, దినేష్, సన్ని, లక్కీ, తదితరులు పాల్గొన్నారు.

## మినీ ట్యాంకు బండ్ను సందర్శించిన న్యాయమూర్తి



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి జిల్లా అడ్మినిస్ట్రేటివ్,హైకొర్టు న్యాయమూర్తి సూరపల్లి నంద పెద్దపల్లి పట్టణానికి విచ్చేసిన సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ దాసరి మమతా రెడ్డి పూల బొకే అందించి, శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు .ఈ సందర్భంగా హైకొర్టు న్యాయమూర్తి శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు.హైకొర్టు న్యాయమూర్తి వెంట పెద్దపల్లి న్యాయమూర్తి హేమంత్ కుమార్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల రక్షణ, భద్రతకు షీ టీమ్స్



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** మహిళల రక్షణతో పాటు వారి భద్రత కోసం షీ టీమ్స్, పోలీసు సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా వ్యవహరిస్తుందని శ్రీరాంపూర్ ఎస్ఐ మేకల సంతోష్ అన్నారు. శనివారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏరియాలోని కేరళ మోడల్ స్కూల్ లో సమాజంలో జరుగుతున్న నేరాలు, తీసుకోవలసిన జాగ్రత్తల పైన అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ర్యాగింగ్, పోక్సో, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్యవివాహాలు, వరకట్న చట్టాల పైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. పిల్లలు, మహిళలను వేధింపులకు గురి చేసే వారి పైన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ద్వారా ప్రజలకు మరింత చేరువై సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఎలాంటి సమస్య ఉన్న డయల్ 100 కు కాల్ చేయాలన్నారు. లైంగికంగా వేధింపులకు గురి చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, కొత్తవారిని గుడ్డిగా నమ్మరాదని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఎవరికి ఒటిపిలు చెప్పరాదని అన్నారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సత్యనారాయణ, మల్ల గౌడ్, రమేష్ పాల్గొన్నారు.

## పేపర్ లీకేజీపై సుప్రీం కోర్టు జడ్జీతో విచారణ జరపాలి

**ప్రజాపక్షం/మందమర్రి :** కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇంటిని ముట్టడించిన విద్యార్థి సంఘం నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ మందమర్రి పట్టణ కార్యదర్శి కామెర దుర్గారాజ్ పేర్కొన్నారు. నీట్ పరీక్షలను రద్దు చేసి తిరిగి నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇంటిని ముట్టడించిన ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ పై దాడికి పాల్పడిన పోలీసులను తక్షణమే సస్పెండ్ చేయాలని, నీట్ పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జీతో విచారణ జరిపి కేంద్ర విద్యాశాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలని, లేనియెడల ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## అనుచిత వ్యాఖ్యలు మానుకో



**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** మంత్రి శ్రీధర్బాబు కుటుంబంపై మాజీ ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్ పుట్ట మధు అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని యూత్ కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు.పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శ్రీపాద రావు దయాదాక్షిణ్యాలతో రాజకీయంగా ఎదిగిన పుట్ట మధుకు కోట్ల రూపాయల ఆస్తులు ఎక్కడి నుండి వచ్చాయని నిలదీశారు. అవినీతికి కేరాఫ్ గా ఉన్న పుట్ట మధుకు దుద్దిల్ల కుటుంభం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. కాళేశ్వరం ఎస్పైగా ఉన్న వ్యక్తి చర్యలకు కాంగ్రెస్ నాయకులకు ఏం సంబంధమని ప్రశ్నించారు. ఇకపై మంత్రి కుటుంబంపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని నాయకులు కాశిపాక ప్రశాంత్, కాంపెల్లి సతీష్, కల్వల సాగర్, ప్రవీణ్, వేమన, రంజిత్, శంకర్, నర్సన్న హెచ్చరించారు.

## లీగల్ మెట్రాలజీ అధికారుల దాడులు...

**ప్రజాపక్షం/మంథని :** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో లీగల్ మెట్రాలజీ అధికారులు పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. శనివారం పట్టనంలోని హర్డ్‌వేర్, ప్లైవుడ్, కిరాణ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అలాగే పండ్ల దుకాణాల్లో సైతం తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో వినియోగించే ఎలక్ట్రికల్ కాంటాలను పరిశీలించి స్టాంపు లేనివి, తూకాలు సరిగా లేని కాంటాలను సీజ్ చేసిన అధికారులు సదరు వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. పట్టణంలోని సుమారు ఆరుగురు వివిధ దుకాణ యజమాలకు రూ.31,500జరిమానాలు విధించినట్లు అధికారులు తెలిపారు. వ్యాపారులు తూనికలకు సంబంధించిన కాంటాలు సక్రమంగా ఉండాలని, ఎలక్ట్రికల్ కాంటాలనే వినియోగించాలని, స్టాంపులు లేని పక్షంలో కేసులు నమోదు చేయడం, జరిమానాలు విధించడం జరుగుతుందని లీగల్ మెట్రాలజీ జిల్లా అధికారి విశ్వేశ్వర్ తెలిపారు.

## పెరుక సంఘం అధ్యక్షుడిగా రవి

**ప్రజాపక్షం/చందుర్తి :** చందుర్తి గ్రామ శాఖ పురగిరి క్షత్రియ పెరుక సంఘం నూతన అధ్యక్షులుగా మెంగని రవి ఎన్నికయ్యారు. చందుర్తి మండల కేంద్రంలోని సంఘ భవనంలో శనివారం పెరుక సంఘం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షులుగా రవి, ఉపాధ్యక్షులుగా మార్త బలరాం ఎన్నికైనట్లు పెరుక సంఘం జిల్లా అధ్యక్షులు మార్తసత్తయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చందుర్తి మండలం లో పెరిక సంఘం అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని శాలువాతో సన్మానించారు.

## ముంపు గ్రామాల సమస్యలపై కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** జిల్లాలోని వేములవాడ అర్బన్ మండలం ప్రజా ప్రతినిధులు శనివారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ను కలెక్టరేట్ కార్యాలయం లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ తో ముంపు గ్రామాల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ముంపు గ్రామాల సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా ముంపు గ్రామాల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పిటిసి మ్యాకల రవి, ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు, సెస్ డైరెక్టర్ రేగులపాటి హరిచరణ్ రావు, మాజీ వైస్ ఎంపీపీ ఆర్‌సి రావు, బిఆర్ఎస్ నాయకులు కొండపల్లి వెంకటరమణ రావు, రాము ఉన్నారు.

## మోడల్ స్కూల్‌లో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లిలో గల తెలంగాణ మోడల్ స్కూల్ 6,7,8,9,10 తరగతులలొ ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ ప్రిన్సిపాల్ ఏరువ రఘునాథ్ ప్రకటనను విడుదల చేశారు. జూన్ 30 లోపు నేరుగా పాఠశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ రఘునాథ్ తెలిపారు.

# కార్పొరేట్ ముసుగులో కాసుల దోపిడీ

### సిబిఎస్, టెక్నో సిలబస్ పేరుతో అడ్డగోలు వసూళ్లు

### ఫీజుల నియంత్రణపై సర్కారు చోద్యం

**ప్రజాపక్షం/మంచిర్యాల ప్రతినిధి :** చదువుకునే కాలం నుండి చదువుకొనే కాలంలో ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభమైంది. జూన్ మాసంలో ప్రారంభమైన పాఠశాలల్లో ప్రస్తుతం ఫీజుల మాట వింటేనే తల్లిదండ్రులకు ఫీవర్ వస్తుంది. ప్రైవేటు పాఠశాలల్లో దోపిడీకి అడ్డు అదుపు లేకుండా పోతోంది. ప్రైవేటులో అడ్మిషన్ అనగానే పిల్లల తల్లిదండ్రులకు పగలే చుక్కలు కనిపిస్తున్నాయి. కార్పొరేట్ పాఠశాలలు గత ఏడాది కంటే ఈ ఏడు ఏకంగా 30శాతం ఫీజులు పెంచి వసూళ్లు చేస్తుండటం వలన తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో ప్రైవేటు పాఠశాలల మాఫీయా పిల్లల తల్లిదండ్రులను నిలువు దోపిడీకి పాల్పడుతున్న సంబంధిత అధికారులు తమకేమి తెలియనట్లు గమ్మున ఉండిపోతున్నారు. కార్పొరేట్ పాఠశాలల పేర్లు చెప్పుకొని కొన్ని పాఠశాలలు వేల ఫీజులు వసూళ్లు చేస్తుండగా, సిబిఎస్, టెక్నో సిలబస్ పేరుతో మరికొన్ని పాఠశాలలు ఇష్టారీతిన ఫీజులు దండుకుంటున్నారు. దీంతో చిన్నా చితక ప్రైవేటు పాఠశాలలు చతికిల పడుతున్నాయి. ప్రతి ఏటా







ప్రైవేటు పాఠశాలలు ఈ రకమైన దందాను నడుపుతున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు మాత్రం మొద్దునిద్ర వహిస్తున్నారనే విమర్శలు అనేకం ఉన్నాయి. ప్రైవేటు యాజమాన్యాలు అందించే అమ్యమ్యాలకు ఆశపడి అధికారులు పట్టన్నట్లు ఉండిపోతున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ పాఠశాలల్లో కొత్తగా చేరే విద్యార్థులకు కేవలం అడ్మిషన్ ఫాం కోసం రూ. 1000 నుండి రూ.2వేలు వసూళ్లు చేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

### నోట్ బుక్స్, టై, బెల్ట్, యూనిఫాం పేరిట మరింత వసూళ్లు

ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడి ఓ రకంగా ఉంటే నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్స్, వర్క్ బుక్స్ పేరుతో లక్షలు వసూళ్లు చేస్తున్నారు. ఈ పాఠశాలల్లో యాజమాన్యాలు అమ్మిన పుస్తకాలే కొనుగోలు చేయాలి. 1వ తరగతి విద్యార్థులకు అవసరమైన వర్క్ బుక్స్, నోట్ బుక్స్ ఈ ఏడాది రూ.6500 నుండి రూ.7500 వరకు వసూళ్లు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వ పాఠ్య పుస్తకాల్లోని అంశాలనే బోదించాలి. కాని సిబ్యాచ్, టెక్నో పేర్ల తో 6వ తరగతి విద్యార్థికి రూ.8500, ఆ పై తరగతులకు రూ.12000 కేవలం టెక్ట్ బుక్స్‌కే వసూళ్లు చేస్తున్నారు. ఇవి కాకుండా సరిపడ నోట్ బుక్స్, ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు బయట కొనాల్సిందే.

### ఫీజుల నియంత్రణలకు పోరాటాలు : ఎఐఎస్ఎఫ్

కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు విద్యార్థుల పక్షాన నిలబడి పోరాటాలు చేయడం జరుగుతుందని, ప్రభుత్వం పాఠశాల ఫీజుల నియంత్రణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ బచ్చలి అభిరాం, కో కన్వీనర్ సిద్దార్థ్ అన్నారు. జిల్లాలోని అనేక పాఠశాలల్లో మౌలిక వసతులు లేవని, 70 శాతం పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలు కూడ లేవని, ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించకుండా నిర్మాణం చేసిన భవనాల్లో పాఠశాలలు నిర్వహించడం జరుగుతుందన్నారు. తక్షణమే జిల్లా విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## జూన్ 26న జాబ్ మేళా నిర్వహణ

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలోని నిరుద్యోగ యువకులకు కృషి విజ్ఞాన్ ఫర్టిలైజర్స్, హైదరాబాద్ కంపెనీ ద్వారా పెద్దపల్లి జిల్లాలో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 26న బుధవారం రోజున ప్రభుత్వ ఐ.టి.ఐ. కళాశాల, పెద్దపల్లి నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై. తిరుపతి రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.కృషి విజ్ఞాన్ ఫర్టిలైజర్స్ కంపెనీ నందు 60 సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్ట్ లు, 4 ఫీల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్, 2 హెచ్ ఆర్ , ఒకటి ఆఫీస్ బాయ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, సేల్స్ ఎగ్జిక్యూటివ్ లకు డిగ్రీ, డిప్లమా, ఫీల్డ్ డెవలప్మెంట్ అధికారికి అగ్రికల్చర్ బీఎస్సీ, హెచ్‌ఆర్ లకు మార్కెటింగ్ ఎంబీఏ, ఇతర హెచ్ ఆర్ మేనేజ్మెంట్, ఆఫీస్ బాయ్ కి పదవ తరగతి పైన విద్యార్హతలు ఉండాలని, ప్రతి పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయస్సు 18 నుంచి 40 ఏళ్లు లోపు ఉండాలని తెలిపారు.సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్ట్ కు పురుషులు, మహిళలు ఇద్దరు దరఖాస్తు చేసుకోవచ్చని, మిగిలిన పోస్టులకు పురుషులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

ఈ కంపెనీలో చేరిన సేల్స్ ఎగ్జిక్యూటివ్ లకు వేతనం నెలకు 9 నుంచి 15 వేలు, ఫీల్డ్ డెవలప్మెంట్ అధికారికి వేతనం నెలకు 10 నుంచి 15 వేలు, హెచ్‌ఆర్ లకు వేతనం నెలకు 12 నుంచి 16 వేలు, ఆఫీస్ బాయ్ కు వేతనం నెలకు 8 నుంచి 10 వేలు ఉంటుందనీ, ఆసక్తి, సంబంధిత విద్యార్హత కలిగిన వారు జూన్ 26న ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూ కొరకు సర్టిఫికేట్స్ జిరాక్స్ లతో వచ్చి తమ పేరు నమెదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9885824326, 8121262441 నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు ఆ ప్రకటనలో తెలిపారు.

## జిల్లాపరిషత్ స్కూల్ నుంచి జాతీయ స్థాయికి

### ఇన్స్పైర్ మానాక్ పోటీలకు పవర్ లూమ్ క్లాత్ ఫోల్డింగ్ మెషీన్ ఎంపిక

### సిరిసిల్ల ప్రభుత్వ స్కూల్ విద్యార్థి హేమంత్ ప్రతిభకు గుర్తింపు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** తల్లిదండ్రులు, పవర్ లూమ్ కార్మికులు ఇబ్బందులు దూరం చేయాలనే ఆ విద్యార్థి ఆలోచనకు ఉపాధ్యాయుడి తోడ్పాటుతో రూపం వచ్చింది. పవర్ లూమ్ క్లాత్ ఫోల్డింగ్ మెషీన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి దేశ రాజధాని లో చేపట్టనున్న పోటీలకు ఎంపికవడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. కష్టాలను ఎలాగైనా దూరం చేయాలని సిరిసిల్ల పట్టణం గణేష్ నగర్‌కు చెందిన జక్కని జ్ఞానేశ్వర్, రూప కొడుకు హేమంత్ సిరిసిల్ల శివ నగర్‌లోని కుసుమ రామయ్య బాలుర స్కూల్ పదో తరగతి చదువుతున్నాడు. నిత్యం తన ఇంట్లో పవర్ లూమ్‌లపై ఉత్పత్తి అయిన బట్టలను మడత పెట్టేందుకు తన తల్లిదండ్రులు, సమీపంలోని కార్మికులు ఇబ్బంది పడుతున్నది చూసాడు. గంటల తరబడి బట్టను మడత పెడుతూ కాళ్లు, నడుము నొప్పులతో బాధపడే వారిని చూసి కన్నీటి పర్యంతమయ్యాడు. వారి కష్టాలను ఎలాగైనా దూరం చేయాలని ఎన్నో రోజులు ఆలోచించాడు. దీనిపై తన స్కూల్ లోని ఉపాధ్యాయులతో మాట్లాడాడు. వారి సలహాలు, సూచనల మేరకు దాదాపు రెండు నెలల పాటు కష్టపడి రూ. రెండు వేలతో పవర్ లూమ్ క్లాత్ ఫోల్డింగ్ మెషీన్ ను చక్రాలు, చైన్స్, మోటార్, సెన్సార్ ను ఉపయోగించి తయారు చేశాడు. బట్టలు మడత పెట్టేందుకు గంట సమయం పడుతుండగా, ఈ యంత్రం సాయంతో కేవలం పది నిమిషాల వ్యవధిలో పూర్తి చేయవచ్చని హేమంత్ చెప్పాడు.

### కలెక్టరేట్ లో ప్రదర్శన

హేమంత్ తయారు చేసిన పవర్ లూమ్ క్లాత్ ఫోల్డింగ్ మిషన్ ఫిబ్రవరిలో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికకాగా, అప్పటి కలెక్టర్ అభినందించారు. అలాగే సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఆవరణలో హేమంత్ ఎగ్జిబిట్ ను ఏర్పాటు చేసి ప్రదర్శించారు. ఈ ఎగ్జిబిట్ ని టీ వర్క్స్ హైదరాబాద్ కి పంపించారు. రాష్ట్ర స్థాయి నుంచి హేమంత్ తయారు చేసిన ఎగ్జిబిట్ ను ఈ నెల 16, 17 తేదీల్లో హైదరాబాద్ లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జాతీయ స్థాయి ఇన్స్పైర్ మానాక్ కు ఎంపికైంది. వచ్చే నెలలో ఈ పోటీలు నిర్వహించనున్నారు.

### ప్రతిభ చూపిన విద్యార్థికి కలెక్టర్ అభినందన

ప్రతిభ చూపిన విద్యార్థి జక్కని హేమంత్ ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం అభినందించారు. సిరిసిల్ల పట్టణంలోని కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన సిరిసిల్ల విద్యార్థి జక్కని హేమంత్, గైడ్ టీచర్ పాకాల శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో తయారుచేసిన పవర్ లూమ్ క్లాత్ ఫోల్డింగ్ మిషన్ ఎగ్జిబిట్ ఇన్స్పైర్ మానాక్ జాతీయ స్థాయికి ఎంపికైంది. నేతన్నల కష్టాలకు పరిష్కారం చూపేది గా తయారుచేసిన ఈ ఎగ్జిబిట్ గతంలో పలువురి మన్ననలు పొందింది. ఎగ్జిబిట్ జాతీయస్థాయికి ఎంపికవడంతో జిల్లా విద్యాధికారి ఏ రమేష్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లకావత్ మోతిలాల్ విద్యార్థి హేమంత్ తో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ను కలువగా, వారిని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే అదనపు కలెక్టర్ పూజారి గౌతమి ఆ విద్యార్థిని అభినందించారు.

## పేకాట స్థావరాలపై దాడులు, 8 మంది అరెస్ట్

### నగదు 19,000/- రూపాయలు, ఒక ద్విచక్ర వాహనం, 07 మొబైల్ ఫోన్స్, ప్లేయింగ్ కార్డ్స్ స్వాధీనం

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** సిరిసిల్ల పట్టణ పరిధిలోని అంబేద్కర్ నగర్ లోని సిరిగిరి చిన్న నర్సయ్య అనే వ్యక్తి ఇంట్లో డబ్బులు పందెం పెట్టుకుని రహస్యంగా పేకాట ఆడుతున్నారు. అనే పక్కా సమాచారం మేరకు శుక్రవారం రోజున రాత్రి సమయంలో పేకాట స్థావరం పై దాడి చేసి పేకాట ఆడుతున్న 08 మంది వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుండి 19,000/రూపాయల నగదు,07 మొబైల్ ఫోన్స్, ఒక ద్విచక్ర వాహనం, ప్లేయింగ్ కార్డ్స్ స్వాధీనం చేసుకొని వారి పై కేసు నమోదు చేయడం జరిగిందని సిఐ సదన్ కుమార్ తెలిపారు.

## ప్రభుత్వానికి విన్నవించుకోవాలి..

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** పోడు భూముల కోసం ప్రభుత్వానికి విన్నవించుకోవాలని ఉపాధిహామి గ్రామీణ పథకం క్రింద నడుస్తున్న పనులు ఆపొద్దని సెక్షన్ ఆఫీసర్ సకారం నాయక్ పోడు భూమి లబ్దిదారులకు సూచించారు.గుండారం పోడు భూముల కమిటీ చైర్మెన్ భానోతు రాజునాయక్ తో చర్చించారు.అనంతరం రాజునాయక్ విలేకరుల ప్రకటన చేశారు. గుండారం గ్రామంలో ఎప్పటినుండో వివాదంలో నడుస్తున్న పోడుభూములలో ఉపాధి హామి పనులు నడుస్తున్నాయి.ఆ భూమి మాదేనని గతప్రభుత్వంలో 210 మంది దరఖాస్తు చేసుకుని ఉన్నారు.ఆభూమి లబ్దిదారులు ఆందోళన చెందడంతో పోడుభూమి కమిటి చైర్మెన్ ఆభూములలో జరుగుతున్న పనులపై పునరాలోచన చేయాలని సెక్షన్ అధికారి సకారం నాయక్‌తో విన్నవించుకున్నట్టు సమాచారం.ఇందుకుగాను ఫారెస్టు సెక్షన్ అధికారి స్పందించి పోడు భూములైనా,గురువయ్య భూములైనా క్షేత్రస్థాయి అధికారులతో విన్నవించుకోవాలని ఉపాధిపనులు ఆపవద్దని పోడుభూమి లబ్దిదారులకు సమాధానమిచ్చారని పేర్కొన్నారు.ప్రభుత్వానికి పోడుభూములపై విన్నపం ద్వారానే అర్హులైన వారికి అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వపనులను ఆటంకపరచవద్దని లబ్దిదారులకు వివరించారు.

## షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



**ప్రజాపక్షం /సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ మండల పరిషత్ ఆవరణలో ఏర్పాటు చేసిన షాపింగ్ కాంప్లెక్స్ ను ఈనెల 26వ తేదీన ప్రారంభించడానికి పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావును సుల్తానాబాద్ ఎంపీపీ బాలాజీ రావు పలువురు ఎంపీటీసీలు ఆహ్వానించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎంపీపీ, ఎంపీటీసీలు విజయరమణారావును మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు.